గాంధీనగర్ డివిజన్ అండర్14 క్రికెట్ టోర్నమెంట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో ఈనెల 16, 17 తేదీల్లో డివిజన్‌లో అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్ 2025 నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ సికింద్రాబద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆధ్వర్యంలో వారి నీవి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. శుక్రవారం, శనివారం స్థానిక శ్రీనివాసాగ్రౌండ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. ఆసక్తి గల పిల్లలు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో నిర్వాహకులను సంప్రదించాలన్నారు. వివరాలకు 9177302777, 7799657887, 7842317073, 8686710391 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, శివకుమార్, సాయికుమార్, ఆనంద్‌రావు, సత్యేందర్, రాహుల్, సాయితేజ, నీరజ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మల్లాది రచనలు పాఠకుల్లో ఆసక్తిని కలిగిస్తాయి



సమావేశంలో మాట్లాడుతున్న శంకరనారాయణ తదితరులు

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మల్లాది రామకృష్ణశాస్త్రి రచనలు పాఠకుల్లో ఆసక్తిని కలిగిస్తాయని హాస్య అవధాని, ప్రముఖ జర్నలిస్ట్ శంకర నారాయణ అన్నారు. రామకృష్ణశాస్త్రి రచనలు సంప్రదాయం, ఆధునికత కలబోతగా చక్కని భాష, పదప్రయోగంతో ఉండి పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటాయన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ప్రముఖ కవి పండితులు మల్లాది రామకృష్ణశాస్త్రి యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా శంకరనారాయణ పాల్గొని మాట్లాడుతూ మల్లాది రామకృష్ణశాస్త్రి బహుభాషా విజ్ఞాని అని చెప్పారు. సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ రామకృష్ణశాస్త్రి సినీపాటలను రాసినా రాశిలో తక్కువ కాని వాసికెక్కినవని చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నతికి కారకులైన మల్లాది వంటి వారిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గాయకులు శ్రీమణి, శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, వందేభారత్ సినీనిర్మాత మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అన్నమాచార్య జయంతి



లోకనాథశర్మను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతి వైభవంగా జరిగింది. ప్రముఖ సంగీత విద్వాంసులు తాడేపల్లి లోకనాథశర్మకు అన్నమాచార్య సంకీర్తనాగాన నిపుణ బిరుదు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీడీఎల్ సీఎండీ ఆత్మకూరి మాధవరావు మాట్లాడుతూ మన సంస్కృతిని ప్రస్ఫుటించే కళలు, శాస్త్రీయ సంగీత నృత్యరీతులను భావితరాలకు అందించాలన్నారు. విజయకుమార్, గోదాలక్ష్మి, సుధామాల పాల్గొన్నారు. అన్నమయ్య కీర్తనల ఆలాపన, అన్నమయ్య కథ సంగీత నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి.

'వీధిదీపాల సమస్యను పరిష్కరించండి'

నల్లకుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పోచమ్మ బస్తీ, శ్రీమల్లన్న ఆలయం వీధి, పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా రాత్రివేళల్లో వీధి దీపాలు వెలగడం లేదని, వీటికి మరమ్మతులు చేయాలని ప్రజలు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బుధవారం ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాస్‌ను కార్యాలయంలో కలిసి విన్నవించినట్లు బీఆర్ఎస్ బాగ్ అంబర్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి కెంచె మహేష్‌కుమార్ తెలిపారు. స్పందించిన ఏడీ పోచమ్మబస్తీ, శ్రీమల్లన్న ఆలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ వల్ల విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

'వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నల్లకుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ దళిత మహిళపై ఆ పాఠశాలలో కులపరంగా, లైంగికంగా వేధిస్తున్న వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయదుర్గం ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న నిరుపేద దళితమహిళను కులపరంగా, లైంగికంగా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగాతారాణా, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, ఎంఈవో వెంకటయ్యనాయక్ స్పందించాలని కోరారు.

అందాల పోటీల వ్యతిరేక వేదికపై నిర్బంధం, అక్రమ అరెస్ట్, దాడులు తగవు : వక్తలు

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): అందాల పోటీల వ్యతిరేక వేదిక నిర్వహించే కార్యక్రమాలు, నిర్వాహకులపై నిర్బంధం, అక్రమ అరెస్ట్, దాడులు తగవు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఐలమ్మ భవన్‌లో మిస్‌వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, నాయకురాలు ఝాన్సీ, అనసూయ, హేమలత, ఐద్వా నేతలు మల్లు లక్ష్మి, ఆశాలత, అరుణజ్యోతి, ప్రగతిశీల మహిళాసంఘం నాయకురాలు స్వరూప, చైతన్య సంఘం నేతలు జయ, సావిత్రి, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ జానీబాషా, రచయిత్రి బండారు విజయ, హైమావతి మాట్లాడారు. ఈనెల 31 వరకు జరిగే 72వ అందాల పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చుచేయడం తగదన్నారు. ఈ పోటీలు తెలంగాణ సంస్కృతికి విరుద్ధమన్నారు. ఈ పోటీలను వ్యతిరేకిస్తున్న వారిపై ప్రభుత్వం దాడి చేయడం, అరెస్ట్, అక్రమ కేసులు పెట్టడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ పోటీలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

జీహెచ్ఎంసీ చెత్త తరలింపు లారీ డ్రైవర్ అరెస్ట్

బర్కత్‌పుర, మే 14 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఓ వృద్ధుడి మృతికి కారకుడైన జీహెచ్ఎంసీ చెత్త తరలింపు లారీ డ్రైవర్‌ను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న చాదర్‌ఘాట్ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డు దాటుతున్న ఎస్.సిద్ధేశ్వర్‌ను జీహెచ్ఎంసీ చెత్త తరలింపు లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆ వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. లారీ డ్రైవర్ షేక్ ముఫీజుల్(32)ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీఎస్టీపార్కు, సినిమా థియేటర్లు, హోటళ్ల వద్ద భిక్షాటన చేసే 65 నుంచి 70 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి వీఎస్టీపార్కు వద్ద స్పృహలో లేకుండా పడుకుని ఉండగా, పోలీసులు గుర్తించి 108 అంబులెన్స్‌ను పిలిపించారు. 108 సిబ్బంది పరిశీలించి, మరణించాడని చెప్పారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంబంధీకులు, అతని వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్ఐ అభిలాష్ సూచించారు.

బడి భవనం పూర్తయ్యేది ఎప్పుడో..?

- పిల్లర్లు, స్లాబ్‌కే పరిమితమైన నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న 504 మంది విద్యార్థులు



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు భవన నిర్మాణంపై ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)



నిలిచిపోయిన ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని 2022 సంవత్సరంలో కూల్చివేశారు. పాఠశాల నూతన భవన నిర్మాణానికి 2023 జనవరి నెలలో శంకుస్థాపన చేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి కలిసి భవన నిర్మాణం శంకుస్థాపన చేశారు. మన బడి, మన బస్తీ పథకంలో భాగంగా నూతన పాఠశాల భవన నిర్మాణానికి రూ.4.5 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, జీ+1 అంతస్తులు నిర్మించారు. 3 సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

ఈ విద్యా సంవత్సరానికైనా మోక్షం లభించేనా...

జూన్‌లో ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరంలోనైనా భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యేనా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. 504 మంది విద్యార్థులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల చేయకపోవడం వల్లే..

పాఠశాల భవన నిర్మాణానికి సంబంధిత కాంట్రాక్టర్ రూ.2కోట్ల వరకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం వల్ల మిగతా పనులు పూర్తి చేయడం లేదని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కేవలం పిల్లర్లు, స్లాబ్‌కే భవన నిర్మాణ పనులు పరిమితమయ్యాయని వారు అంటున్నారు.

కేంద్రమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశాం



పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎం పీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, విద్యాశాఖ ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేశాం. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

\- స్వరూపారాణి, ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

పనులు వెంటనే పూర్తి చేయాలి



పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలి. నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి. - శ్రీధర్‌చారి, స్థానికుడు

నిధులు విడుదల చేయాలి



నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యే లా చర్యలు తీసుకోవాలని కోరాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

\- ఎమ్మెల్యే ముఠా గోపాల్

శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణం

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



చప్పల్‌బజార్ దశరథ గల్లీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బర్కత్‌పుర, మే 14 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని అయిదు మున్సిపల్ డివిజన్‌లలో శాశ్వత ప్రాతిపదికన సీసీరోడ్ల నిర్మాణం, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం కాచిగూడ డివిజన్ చప్పల్‌బజార్ దశరథ గల్లీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని బస్తీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మంచినీరు, డ్రైనేజీ, వరదనీటి కాలువల పైప్‌లైన్ నిర్మాణం తర్వాత వెంటనే రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, నాయకులు బి.కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని అయిదు డివిజన్లలో రెండు నెలల్లోనే రూ.5 కోట్లతో నూతన సీసీరోడ్లను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 8లో రూ.26 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలులో జీహెచ్ఎంసీ అధికారులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూర్తి, జి.శంకర్, అనిత, స్వప్న, నల్లకుంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్, నాయకుడు ఎంబీ.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

గ్రేటర్‌లో ఇళ్లు లేని పేదలకు 100 గజాల స్థలం ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఇళ్లు లేని పేదలకు వంద గజాల స్థలం కేటాయించి, పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య బుధవారం వినతిపత్రం ఇచ్చారు. గతంలో శివారు ప్రాంతంలోని కాచవన్, సింగారం, తట్టిఅన్నారంలో పట్టాలు ఇచ్చిన 4 వేల మందికి స్థలాలు కేటాయించి పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఘటకేసర్ మండలంలోని సింగారం, హయత్‌నగర్‌లోని తట్టిఅన్నారం, ఉప్పల్ జయపూర్ కాలనీ, నాగోల్ తదితర ప్రాంతాల్లో పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు కేటాయించాలని మంత్రిని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, వి.రవి, వీరన్న, రామ్మూర్తిగౌడ్, అంజి, బాలయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

న్యూ అచ్చయ్యనగర్ కమిటీ నియామకం



న్యూఅచ్చయ్యనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు బాబుగౌడ్ సభ్యులు

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని న్యూఅచ్చయ్యనగర్ బస్తీ నూతన కమిటీని అధ్యక్షుడు ఎ.జె.బాబుగౌడ్ బుధవారం ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా నర్సింహ, ఛైర్మన్‌గా పైనేరుచారి, ఉపాధ్యక్షులుగా ఆర్.గోపాల్; రవిగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.బాలకృష్ణ, ఎండీ.గౌస్, జి.సురేష్, కోశాధికారులుగా జి.వెంకటేశ్వరరావు, పుట్ట శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.శక్తిసింగ్, కార్యవర్గ సభ్యులుగా పుట్ట శ్రీనివాస్. ఎ.రాజు, కె.భాస్కర్; సతీష్, పుట్ట వసంత్; డి.రాజేష్, హెచ్.మహేష్, సి.రాజు, ఎన్.నరేష్, పి.కిరణ్, సైదులు నియమితులయ్యారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేస్తున్న రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ సిఫారసులతో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

అంబర్‌పేట నూతన సీఐకి సత్కారం



అంబర్‌పేట పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.గోవర్ధన్ రెడ్డి, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, చుక్కా జగన్ తదితరులు - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

'ప్యూరోపాల్' పై చర్యలు తీసుకోవాలి: ఆప్

కవాడిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆప్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఉద్యోగాల పేరుతో మోసపోయిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. బుధవారం లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో ప్యూరోపాల్ ఐటీ సొల్యూషన్స్ ఉద్యోగులు తమకు న్యాయంచేయాలని బాధితులు ఆప్ పార్టీ నేతలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు తీసుకుని బోర్డు ఎత్తివేసిన ప్యూరోపాల్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీ యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చెస్ పోటీల్లో డిగ్రీ విద్యార్థికి ద్వితీయ స్థానం



విద్యార్థి అక్షయకుమార్‌ను అభినందిస్తున్న సరోజ వివేక్, ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎల్ అకాడమి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో నగరంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎం.అక్షయకుమార్ ద్వితీయ స్థానం సాధించాడు. ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 191 మంది చెస్ క్రీడాకారులు పాల్గొనగా అక్షయకుమార్ ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజవివేక్, సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ ఎం.శేఖర్, డైరెక్టర్ శ్రావణ్ అధ్యాపకులు ఎం.అక్షయకుమార్‌ను సత్కరించి అభినందించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీశైలం యాదవ్‌కు పితృవియోగం



సత్యనారాయణ (ఫైల్)

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీశైలం యాదవ్ తండ్రి సత్యనారాయణ(74) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం యశోధ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి, చనిపోయారని ప్రకటించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గట్లా సత్యనారాయణ దివంగత ముఖ్యమంత్రి టి.అంజయ్య హయాంలో కాంగ్రెస్‌లో కీలకపాత్ర పోషించారు. ఆయన అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్ శ్మశాన వాటికలో జరిగాయి.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ షకీల్, అబ్దుల్ లతీఫ్, గులామ్ మోహినొద్దీన్, ఆబేద్ హుస్సేన్, మహ్మద్ అలీకి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ... పేదలకు ప్రైవేటు ఆస్పత్రులలో మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహద పడుతుందన్నారు. పేదలకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతిరూపం అమ్మ

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతిరూపం అమ్మ అని ప్రముఖ రచయిత్రి, పరిశోధకురాలు డా.బండారు సుజాతాశేఖర్ అన్నారు. ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా బుధవారం సుజాతాశేఖర్ దంపతులను ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర(ఎఫ్‌టామ్) సంస్థవారు సన్మానించారు. ఈ సందర్భంగా సుజాతాశేఖర్ మాట్లాడుతూ అమ్మతనం ఓ వరం అన్నారు. పుట్టిన భూమి కూడా అమ్మలాంటిదేనన్నారు. మహిళకు బంధాలు, బాధ్యత అదృష్టమే కాని భారం కాదన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన అమ్మ పడే ప్రసవవేదన మాటల్లో చెప్పలేనిదన్నారు. ఆడపిల్లలు నేటికీ అవమానాలకు నిరాదరణకు గురికావడం బాధాకరమన్నారు. ఇంటిలో మహిళకు కుటుంబసభ్యుల నుంచి సహకారం, ప్రేమ అందాలన్నారు. ఈ కార్యక్రమంలో గంజి జగన్‌బాబు, అధ్యక్షుడు బీకే.అశోక్, ప్రధానకార్యదర్శి బీఎం.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఎస్.కృష్ణమూర్తి, బ్రహ్మం తదితరులు

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో సత్యసాయి సేవా సమితి సభ్యులందరూ చేస్తున్న కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని సత్యసాయి సేవాసమితి విద్యానగర్ శాఖ అధ్యక్షుడు ఎస్.ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం రాంనగర్ గుండూ చౌరస్తాలో సత్యసాయి సేవా సమితి విద్యానగర్ శాఖ సభ్యులు, లలితానగర్, అడిక్‌మెట్ కాలనీల రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.బ్రహ్మం, శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సత్యనారాయణ, ఎస్.ఎస్.కె.ప్రసాద్, డి.లక్ష్మీనారాయణ, జీవీఎన్.రెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రనాథ్‌గుప్తా, సుగుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.